# సాక్షి
## అనకాపల్లి

శుక్రవారం, 15, నవంబర్, 2024




### చెరువులో అక్రమ నిర్మాణాలు

గ్రామాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ చెరువులో కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారు. 8లో



### ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్‌షిప్‌కు శ్రీకారం

హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. 8లో




### 'దేవకీ నందన వాసుదేవ' సందడి

మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ'అని ఆ సినిమా హీరో గల్లా అశోక్ అన్నారు. 8లో

## న్యూస్‌రీల్

### సూక్ష్మంలో 'శివం'



బూడిద గుమ్మడి గింజలపై రాసిన గీతం

మాకవరపాలెం : మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ బూడిద గుమ్మడి గింజలపై శివుడి గీతాన్ని రాశాడు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీమంజునాథ చిత్రంలోని మహాప్రాణ దీపం శివం ..శివం అనే గీతాన్ని బూడిద గుమ్మడి గింజలపై సూక్ష్మలిపిలో రాశాడు. ఈ గింజలను శివలింగం చిత్రంపై అతికించి, సూక్ష్మ కళను చాటుకున్నాడు.

### మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

- 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

తుమ్మపాల : మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇస్తుందని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు రెండు నెలలకు రూ.3 వేల స్టయిఫండ్, రూ.వెయ్యి విలువ చేసే స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి మార్కుల జాబితా, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, టీటీసీ, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష రూపాయల లోపు మాత్రమే) ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జతపరచి పట్టణంలో రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కళాశాల వీధిలో ఇంటి నంబర్ 10-06-31/7, చిరునామాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9885845743 కు సంప్రదించాలని తెలిపారు.

### బొమ్మలేశారు..అదరగొట్టారు..



బంగారు పతకాలు పొందిన విద్యార్థులను, ఆర్ట్ టీచర్ అర్జునరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘు తదితరులు

దేవరాపల్లి : ప్రకాశం జిల్లాలో సృష్టి ఆర్ట్స్ అకాడమి వారు నిర్వహించిన నేషనల్ చిల్డ్రన్, యూత్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో దేవరాపల్లి మండలంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటారు. అక్టోబర్‌లో నిర్వహించిన ఈ పోటీలకు సంబంధించి గురువారం ఫలితాలను ప్రకటించారు. ఈ పోటీల్లో ఐదుగురు గురుకుల విద్యార్థులు బంగారు పతకాలు సొంతం చేసుకోవడం విశేషం. గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్న వారిలో బి.సంజయ్‌కుమార్ (టెన్త్), టి.అఖిలేష్ (9వ తరగతి), ఎల్.దినేష్ (7వతరగతి), సిహెచ్. బుజ్జిరాజు (6వ తరగతి), కె.శివచరణ్ (5వ తరగతి) ఉన్నారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఆర్ట్స్ టీచర్ జి.అర్జునరావుకు సృష్టి ఆర్ట్స్ అకాడమి ప్రతినిధులు ఆచార్య సృష్టి పురస్కార్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాటు అవార్డు పొందిన ఆర్ట్ టీచర్ జి.అర్జునరావును స్థానిక గురుకుల ప్రిన్సిపాల్ పి.రఘు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నర్సింహమూర్తి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

### 'అడవి తల్లికి హారతి' నేడు

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ మొండికోటలో శ్రీశైల ఆనందాశ్రమంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అడవి తల్లికి హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు రమేష్, మత్స్యరాజు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

---

**ఈ నెల 8వ తేదీ...** అనకాపల్లి రైల్వేస్టేషన్...మూడో నంబర్ ప్లాట్‌ఫారం...సికింద్రాబాద్–విశాఖ జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతూ రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన పైలా రాజబాబు (39) అనే వ్యక్తి ప్లాట్‌ఫారానికి, రైలు బోగీ ఫుట్‌బోర్డుకు మధ్యలో జారిపడిపోయాడు. అరగంటసేపు రైలు నిలిపి, ఆర్పీఎఫ్ ఎస్ఐ నవీన్, తమ సిబ్బంది, స్థానిక ప్రయాణికుల సహాయంతో ప్లాట్‌ఫారంపై పలకలను తొలగించి, 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన ఆ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**ఈ నెల 14వ తేదీ...** తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి గొల్లప్రోలు–రావికంపాడు మధ్య 27 ఏళ్ల వివాహిత దివ్య అత్త,మామ,భర్త వేధింపులు తట్టుకోలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది.

**ఈ నెల 17వ తేదీ...** పాయకరావుపేటకు చెందిన గంగిరి రమణ(48) అనే వ్యక్తి భవానీ మాలధారణ తర్వాత విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం కోసం వెళ్తూ రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయాడు.

**సెప్టెంబర్ 15వ తేదీ...** వనలపాకల, సర్వవరంకు చెందిన పల్లా నందకుమార్ (46) బహిర్భూమికి వెళ్లి వస్తూ బయ్యవరం వద్ద రైలుపట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇలా ప్రమాదవశాత్తూ రైలు పట్టాలు దాటే క్రమంలో కొందరు..ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలతో మరికొందరు..రైలు బోగీ తలుపు వద్ద కూర్చొని జారిపడి మరణించిన వారు ఇంకొందరు..ఇలా నిత్యం ఏదో ఒక రూపంలో రైలు పట్టాలపై మృత్యువు కూత పెడుతోంది. ప్రాణాలను హరిస్తోంది. ప్రతి నెలా పదుల సంఖ్యలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. రైలు ప్రమాదాల్లో గుర్తించిన మృతదేహాలు కుటుంబ సభ్యులు, బంధువులకు చేరుతున్నా..గుర్తింపులేనివి మరెన్నో..!

**ఈ ఏడాది జనవరి-అక్టోబర్ వరకూ**

| | |
|---|---|
| మొత్తం మరణాలు | 104 |
| రైలు నుంచి జారి పడి మృతి | 41 |
| రైలు పట్టాలు దాటుతూ మృతి | 41 |
| కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నవారు | 17 |
| ఇతర కారణాలతో | 5 |
| మృతుల వివరాలు లభ్యమైనవి | 69 |
| గుర్తు తెలియనివి | 35 |

- తుని–దువ్వాడ రైల్వే స్టేషన్ల మధ్య ఏడాదిలో.. 104 మంది మృతి
- ప్రమాదవశాత్తూ కొందరు, రైలు పట్టాలు దాటుతూ మరికొందరు
- నెలకు సగటున 10 మంది మృత్యువాత
- 35 మంది అనాథ చావులు
- బలన్మరణాలూ ఎక్కువే
- ప్రమాదాల నివారణపై ఉదాసీనత



ఇటీవల బయ్యవరం రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్‌పై మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు(ఫైల్)



- రైలు పట్టాలపై మృత్యు కూత..

# యువర్ అటెన్షన్ ప్లీజ్...

యలమంచిలి రూరల్ : తుని, దువాడ రైల్వే పోలీసుల పరిధిలో దువ్వాడ, తాడి, అనకాపల్లి, కశింకోట, బయ్యవరం, నర్సింగబిల్లి, యలమంచిలి, రేగుపాలెం ,నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు, తుని రైల్వేస్టేషన్లు ఉన్నాయి. సుమారు 80 కిలోమీటర్ల మేర రైలు మార్గం విస్తరించి ఉంది. నిత్యం సుమారు 140 నుంచి 150 వరకు రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే ప్రయాణికులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం..ప్రమాదాల నివారణలో రైల్వే అధికారుల ఉదాసీనత వెరసి నిత్యం ఏదో ఒక చోట నిండు ప్రాణం రైలు చక్రాల కింద ముక్కలైపోతోంది.

**నెలనెలా సగటున 10 మంది...**

ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు తుని–దువ్వాడ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై జారిపడి, బలన్మరణం, సహజ రూపాల్లో 104 మంది మృతి చెందారు. ఇలా నెలకు సగటున 10 మంది రైలు పట్టాలపై కడతేరి పోతున్నారు. ఈ మార్గంలో 10 రైల్వేస్టేషన్ల మధ్య ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు రైల్లో నుంచి జారిపడి 41 మంది మృతి చెందారు. ప్రేమ విఫలమై,కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో 17 మంది ఆత్మహత్య చేసుకున్నారు. రైలు పట్టాలు దాటుతూ 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇతర కారణాలతో ఐదుగురు మృతి చెందారు. వీటిలో 69 మంది వివరాలు లభ్యం కాగా వారి మృతదేహాలను రైల్వే పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగిలిన 35 మృతదేహాల వివరాలు లభ్యం కాకపోవడంతో రైల్వే పోలీసులే అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు.

**అనాథ శవాల అంతులేని వ్యథ**

రైలు పట్టాలపై పడి ఉండే గుర్తు తెలియని మృతదేహాల దృశ్యాలు హృదయాలను కలచివేస్తాయి.ఎక్కడి నుంచో ప్రయాణం చేస్తూ గమ్యస్థానం చేరకముందే అర్ధంతరంగా జీవన ప్రయాణం చాలించే అభాగ్యులెందరో. రైలు పట్టాలపై పడి ఉండే అనాథ శవాలను 72 గంటల తర్వాత ఖననం చేస్తారు. మార్చురీలో భద్రపరచడానికి ముందు రైల్వే పోలీసులు మృతుల ఆనవాళ్లను భద్రపరుస్తారు. పుట్టు మచ్చలు, అంగవైకల్యం, ఎత్తు, రంగు, జుట్టు రంగు ఆ తర్వాత దుస్తులను తీసుకుంటారు. ఇందులో షర్టు కాలర్ మీద ఉన్న టైలర్ చిరునామాను బట్టి ఎక్కడివారో గుర్తిస్తారు. చరవాణి, పర్సులోని గుర్తింపు కార్డులు, చరవాణిలో కాల్ డేటా వివరాలు భద్రపరుస్తారు. అనాథ శవాలకు అంత్యక్రియలు చేసిన తర్వాత వారి సంబంధీకులు వచ్చి అడిగితే ఫొటోల ఆధారంగా గుర్తిస్తారు. ఈ ప్రక్రియలో జీఆర్పీ పోలీసులు కాలర్ బోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి భద్రపరుస్తున్నారు. ఆ నివేదికను పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంచుతారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారెవరైనా మార్గమధ్యంలో మృతి చెందితే వారి సంబంధీకులు అన్ని పోలీసుస్టేషన్లకు వాకబు చేయడం కష్టమవుతుంది. మిస్సింగ్ కేసుల్లో కొందరు అవగాహన లోపంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మిన్నకుంటారు. అనాథ శవాలను సకాలంలో గుర్తించకపోతే ఆ తర్వాత గుర్తుపట్టడం చాలా కష్టంగా ఉంటుందని రైల్వే పోలీసులు చెబుతున్నారు.



అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో రైలుపట్టాలు దాటుతున్న ప్రయాణికులు (ఫైల్)

**రైలు పట్టాలు దాటుతూ..**

సాధారణంగా రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు ట్రాక్ దాటడం కోసం పాదచారుల వంతెన, ఇతర ప్రాంతాల్లో అయితే అండర్‌పాస్, ఆర్వోబీలు నిర్మించారు. అవిలేని చోట రైల్వే గేట్లను ఏర్పాటు చేసిన రైల్వే అధికారులు పౌరుల భద్రతకు చర్యలు చేపట్టారు. అయితే నిర్లక్ష్యంగా రైలు పట్టాలు దాటే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తుని–దువ్వాడ రైల్వే స్టేషన్ల మధ్య ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రైలుపట్టాలు దాటుతూ 41 మంది మృతి చెందారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో లక్షల రూపాయలతో ఫుట్ ఓవర్ వంతెన నిర్మించారు. అయినప్పటికీ ప్రయాణికులు చాలా మంది ఆ వంతెనను ఉపయోగించడం లేదు. నిత్యం వందలాది మంది రైలు పట్టాలు దాటుతూ ప్లాట్‌ఫామ్‌ల పైకి చేరుకుంటున్నారు. ప్రయాణికుల భద్రతకు ఇది ప్రమాదమని తెలిసినా రైల్వే అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదు. రైల్వేగేట్లు మూసి ఉన్నప్పుడు రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించి ఇంకొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. మూడురోజుల క్రితం అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు జన్మభూమి రైలు దిగుతూ ప్లాట్‌ఫాంపై జారిపడ్డాడు. రైలుబోగీ, ప్లాట్‌ఫాం మధ్య ఇరుక్కుపోయాడు. ప్లాట్‌ఫాంను తవ్వి యువకుడ్ని కాపాడారు.

**అవగాహన కల్పిస్తున్నాం**



రైలు పట్టాలపై మరణాలకు సంబంధించిన కేసులను తగ్గించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. పట్టాలపై అనుమానాస్పదంగా కనిపించినవారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. కదిలే రైలు ఎక్కడం, దిగడం చేయరాదు. ఒకవేళ రైలు స్టేషన్ దాటిపోతే మరో స్టేషన్‌లో దిగి గమ్యస్థానాలకు చేరుకోవాలి. రైలుపట్టాలు దాటాల్సి వస్తే ముందు వెనుక చూసుకోవాలి. మలుపుల వద్ద జాగ్రత్తగా ఉండాలి. రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫారంలకు వంతెనల మీదుగా వెళ్లడం మంచిది. రైళ్లలో ప్రయాణించే సమయంలో తలుపుల వద్ద కూర్చోరాదని కూడా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం.

–జి శ్రీనివాసరావు, జీఆర్పీ ఎస్ఐ, తుని

---



**దేవతలారా దీవించండి...**

నర్సీపట్నం : చిన్నారి పొన్నారి పాపలు...రత్నాల చిట్టి దివ్వెలు..పలుకు వెన్నెల పసివాళ్లు..ఆబాలగోపాలురంతా సందడి చేశారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సిటీక్లబ్‌లో గురువారం జరిగిన చిల్డ్రన్స్ డే వేడుకల్లో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

---

నాటి అభివృద్ధి పనులపై

# కూటమి కక్ష!

- బుచ్చెయ్యపేటలో సిమెంటు రోడ్డు శిలాఫలకం ధ్వంసం
- టీడీపీ నాయకుల దుశ్చర్య
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట : మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన సిమ్మెంట్ రోడ్డుకు సంబంధించి శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. నాలుగేళ్ల కిందట బుచ్చెయ్యపేట ప్రధాన రోడ్డును విస్తరించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృషితో ఇరుకుగా ఉన్న మెయిన్ రోడ్డును 24 అడుగుల సిమెంట్ రోడ్డుగా ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట కరణం ధర్మశ్రీ, అప్పటి అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి ఈ సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అప్పట్లో సిమెంట్ రోడ్డును ఆనుకుని మాజీ ఎంపీపీసీ రాంబాబురాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని బుధవారం రాత్రి టీడీపీ నాయకులు గునపాలతో తొలగించి ధ్వంసం చేశారు. గురువారం ఉదయం శిలా ఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని చూసిన వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం చెందారు. శిలాఫలకాన్ని తొలగించడంపై జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.అచ్చెంనాయుడు,డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ, మాజీ ఎంపీటీసీ సుంకరి శ్రీను, స్కూల్ కమిటీ చైర్మన్ పాతాళ సత్తిబాబు, ఉప సర్పంచ్ ధనరెడ్డి దేవి, మాజీ ఉప సర్పంచ్ శనివాడ అప్పారావు, వార్డు మెంబర్లు శనివాడ అప్పారావు, గనిరెడ్డి సత్తిబాబు, సూరిశెట్టి సత్తిబాబు, శనివాడ బాల టీడీపీ నాయకుల దుశ్చర్యను ఖండించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పథకం శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



గత ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో నిర్మించిన మెయిన్ రోడ్డు (ఇన్‌సెట్) టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన శిలాఫలకం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

---

ఆనందం నిండుగ..

# చిల్డ్రన్... ఫన్‌డుగ

బాల్యమొక స్ఫూర్తి...చిన్నారులు ఎదిగే క్రమంలో వారి ఆలోచనలపై చూపించే ప్రభావమే వారి జీవిత గమ్యాలను నిర్దేశిస్తాయి. పిల్లల చిన్నప్పటి అభిరుచులే వారి లక్ష్యాలుగా మార్పు చెందుతాయి. ఈ ప్రయాణంలో కొందరు చదువులపై ఆసక్తి కనబరిస్తే మరికొందరు సంగీతం, క్రీడలు, డాన్స్, పెయింటింగ్ తదితర అంశాలపై మక్కువ చూపుతుంటారు. పసిప్రాయంలోనే ఇలా అత్యుత్తమ నైపుణ్యాలతో రాణిస్తున్న చిన్నారుల సమక్షంలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

- సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఘనంగా చిల్డ్రన్స్‌డే వేడుకలు
- ఆటపాటలతో చిన్నారుల సందడి
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ కోటేశ్వరరావు, సమగ్ర శిక్షణ ఏఎల్ఎస్ఓ గిరిధర్
- పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ



బహుమతులు తీసుకున్న విద్యార్థులు, ఆటల్లో పాల్గొన్న విద్యార్థులతో ఎంఈఓ కోటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ రాజుబాబు తదితరులు

అనకాపల్లి : అనకాపల్లి టౌన్‌లో విజయరామరాజు పేటలో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ వసతి గృహంలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంఈఓ కోటేశ్వరరావు హాజరయ్యారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళుర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి ఆటల పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో థింసా నృత్యం, పాటలతో అలరించారు.

**ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు**

ఈ సందర్భంగా ఎంఈఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే బాలలకు ఉజ్వల భవిష్యత్తు అని అన్నారు. చదువుకు పేద, ధనిక అనే తేడా ఉండదని తెలిపారు. నెహ్రూకు పిల్లలన్నా..గులాబీలన్నా అమితమైన ప్రేమ..అని నెహ్రూ ఏ కార్యక్రమానికి వెళ్లినా పిల్లలను వెతికి మరీ ఆప్యాయంగా పలకరించేవారని అన్నారు. పిల్లలు కనిపిస్తే వారికి కానుకలను కూడా ఇచ్చి ఉత్సాహపరిచేవారని తెలిపారు. అందుకే నెహ్రూని 'చాచా నెహ్రూ' అని పిలుచుకుంటారని అన్నారు. ఆయన జయంతి రోజుల బాలల దినోత్సవం జరుపుతారని తెలిపారు. సమగ్ర శిక్షణ ఏఎల్ఎస్ఓ గిరిధర్ మాట్లాడుతూ అనాథ వసతి గృహాల్లో ఉంటే విద్యార్థులకు ఉన్నత చదువులు అభ్యసించే విధంగా దాతలు ముందుకు వచ్చి వారి సహాయ సహకారాలను అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోష్ ఆవాసియ విద్యాలయ వసతి గృహం వార్డెన్ రాజుబాబు, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ బి.ఎస్.వి.లోవరాజు, అడ్వటైజ్‌మెంట్ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఎంవీఆర్ మూర్తి ,ఆర్‌సీ ఇంఛార్జి వీరబాబు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ కోటేశ్వరరావు



కబడ్డీ పోటీలో తలపడుతూ..



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



వాలీబాల్ పోటీలో ఉత్సాహంగా...

## క్లుప్తంగా

### ఏపీ రెడెన్షియల్ పాఠశాలను సందర్శించిన డీఈఓ


మధ్యాహ్నం వంటలు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈవో

**అచ్యుతాపురం :** అచ్యుతాపురం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను డీఈఓ అప్పారావు నాయుడు గురువారం సందర్శించారు. మధ్యాహ్నం పాఠశాలలో వంటలను పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి పలు సూచనలు ఇచ్చారు. జాతీయ విపత్తుల నివారణ బృందం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను వీక్షించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి అకడమిక్ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఎంఈవో దేవరాయలు, తహసీల్దార్ జనార్దన్, ఎంఈఓ 2 రజనీ, ప్రోగ్రామింగ్ అధికారి వై.వెంకటేశ్వరరావు ఆయన వెంట కార్యక్రమంలో పాల్గొన్నారు.

### స్కానింగ్ కేంద్రాల తనిఖీ


నారాయణి ఉమెన్ స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

**అనకాపల్లి :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో నారాయణి ఉమెన్ సెంటర్‌లో స్కానింగ్ మిషన్‌ను గురువారం డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.ఎస్.వి.కె.బాలాజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం 1994 అమల్లో భాగంగా స్కానింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రోగి అనుమతి మేరకు, వైద్యుల సూచనల మేరకు స్కానింగ్ పరీక్షలు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే సమయంలో కడుపులో బిడ్డ విషయంలో గోప్యంగా ఉంచాలని కోరారు. దశల వారీగా పోలీసు, స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువులో అక్రమ నిర్మాణాలు

చెరువులు, గెడ్డలు కాదేదీ ఆక్రమణలకు అనర్హం అన్నట్టుగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అధికారం దన్నుతో చెరువు గర్భంపై కన్నేసిన నేతలు అక్రమంగా నిర్మాణాలకు తెగించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నేతల ఒత్తిడితో అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెట్టడంపై రైతులు మండిపడుతున్నారు.


చెరువు గర్భంలో వేసిన షెడ్డు

- కూటమి నేతల బరితెగింపు
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో ఆగిన నిర్మాణాలు
- నిర్మాణాలు తొలగించకుండా వదిలేసిన అధికారులు
- రాత్రి వేళల్లో తిరిగి కొనసాగించేందుకు ప్రణాళిక


రాజు చెరువులో అక్రమ నిర్మాణం

**నాతవరం :** గ్రామాన్ని ఆనుకోని ఉన్న ప్రభుత్వ చెరువులో కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారు. మండలంలో లింగంపేట పంచాయతీలో సర్వే నెంబరు 17లో సుమారుగా 26 ఎకరాలు 95 సెంట్లు విస్తీర్ణం గల రాజు చెరువు ఉంది. ఈ చెరువు ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో 150 నుంచి 200 ఎకరాల మేర వరి పంట పండిస్తారు. ఇటీవల ఇళ్ల స్థలాల ధరలకు రెక్కలు రావడంతో స్థానికంగా ఉన్న కూటమి నేతలు చెరువు గర్భంపై కన్నేశారు. మొదట తాటాకు పాకలు తర్వాత షెడ్లు, ఆపై భవనాలు నిర్మించడానికి ప్రణాళిక వేశారు. స్థానికంగా ఉన్న అధికారులను అధికారం అండతో మచ్చిక చేసుకుని చెరువును ఆక్రమించారు. రెండు నెలల క్రితం రాత్రి సమయంలో కూటమి నేతలు దన్నుతో ప్రార్థనా మందిరం నిర్మాణం పనులు చేస్తుండగా అయకట్టు రైతులు అడ్డుకున్నారు. కొద్ది రోజులు ఆగి రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా పనులు చేయడంతో మరలా రైతులు అడ్డగించారు. దీంతో స్థానికులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న అధికారులు కూటమి నేతల ఒత్తిడులకు తలొగ్గడంతో గత నెల 28 తేదీన చెరువు ఆయకట్టు రైతు జిల్లా కలెక్టరుకు ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ చెరువులో చేస్తున్న అక్రమ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. పనులు చేయరాదని ఆక్రమణదారులను హెచ్చరించి వచ్చేశారు. చెరువు గర్భంలో ఆక్రమించి నిర్మించిన తాటాకు పాకలను, షెడ్డును ఖాళీ చేయించకుండా వదిలేసి వచ్చారు. కలెక్టరుకు స్వయంగా ఫిర్యాదు చేసినా దిగువ స్థాయి అధికారులు నామమాత్రంగా చర్యలు చేపట్టడంతో రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు గ్రామాన్ని అనుకుని ఉండడంతో ఇళ్ల స్థలాలకు అనుకూలంగా ఉంది. ఈ ప్రాంతంలో ఇల్లు కట్టుకునేందుకు సెంటు స్థలం లక్ష రూపాయలకు పైగా ధర పలుకుతోంది. దీంతో కూటమి నేతలు చెరువు గర్భంపై కన్నేసి క్రయ విక్రయాలకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారులపై తహసీల్దార్ మొక్కుబడిగా చర్యలు తీసుకోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెరువు గర్భంలో ఆక్రమణదారుల నిర్మాణాలు అలాగే దర్శనమిస్తున్నాయి. పరిస్థితి చల్లబడ్డాక మళ్లీ నిర్మాణాలు చేపడతారని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసి గర్భంలో నిర్మాణాలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### పోలీసు కేసు పెడతాను



లింగంపేట గ్రామంలో గల రాజు చెరువు గర్భంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా పోలీసు కేసులు పెడతాను. నేను చెరువులో పరిశీలించిన అక్రమ నిర్మాణాలు అప్పుడు మాదిరిగా కాకుండా అదనంగా ఒక్క బొషెడ్డు నిర్మాణం చేసినా కేసు పెట్టి వారిపై చర్యలు తీసుకుంటాం. అందులో ఎలాంటి సందేహం లేదు.

–ఎ.వేణుగోపాల్, తహసీల్దార్, నాతవరం మండలం

# మహిళల చేతుల్లో కొండచిలువ హతం


హతమార్చిన కొండచిలువతో మహిళలు

**మాకవరపాలెం :** భారీ కొండచిలువను మహిళలు హతమార్చారు. మండలంలోని భీమభోయినపాలెం గ్రామ సమీపంలో జీడి మామిడితోటల్లో పని చేస్తున్న మహిళలకు సుమారు 12 అడుగల భారీ కొండచిలువ గురువారం కనిపించింది. అయితే ఆ మహిళలు ఏమాత్రం భయపడకుండా కొండచిలువను హతమార్చి ఔరా అనిపించుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకుని కొండచిలువను ఆసక్తిగా తిలకించారు.

# విద్యార్థి దశలోనే చట్టాలు తెలుసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్‌ఖాన్
- చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

**నర్సీపట్నం :** విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీస్సు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ విద్యార్థులకు సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు అవరణలో గురువారం గురుకుల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కోర్టు నిబంధనలను వివరించారు. విద్యార్థులకు కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించేందుకు అవకాశం కల్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీనియర్ జడ్జి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోయేషన్ ప్రెసిడెంట్ ఎం.ప్రభాకర్, న్యాయవాదులు కె.అప్పలనాయుడు, పి.నర్సింహరావు పాల్గొన్నారు.

# ఏయూ బ్యాడ్మింటన్ కోచ్‌గా పోలిరెడ్డి


వై పోలిరెడ్డి

**యలమంచిలి రూరల్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పురుషులు, మహిళల బ్యాడ్మింటన్ కోచ్‌గా యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై.పోలిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వ్యాయామ విద్య సంచాలకులు ఎన్.విజయ్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు.

ఇటీవల జరిగిన సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీల్లో వర్సిటీ పురుషుల జట్టు ఉత్తమ ప్రదర్శన కనబరచడంలో కీలక పాత్ర పోషించిన పోలిరెడ్డిని మళ్లీ వర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహించనున్న మెన్, ఉమెన్ జట్లకు బ్యాడ్మింటన్ కోచ్‌గా నామినేట్ చేశారు. త్వరలో రాజస్థాన్ జగదీష్ ప్రసాద్ జబర్మల్ టిబ్రివాల యూనివర్శిటీలో వచ్చేనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ టోర్నమెంట్, ఈ నెల 26 నుంచి 28 వరకు బెల్గాం వీటీ యూనివర్శిటీలో జరిగే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల బ్యాడ్మింటన్ పోటీలకు ఆంధ్రవిశ్వవిద్యాలయం తరపున పాల్గొనే జట్లకు పోలిరెడ్డి శిక్షకుడిగా వ్యవహరించనున్నారు. తమ కళాశాల పీడీ ఏయూ జట్లకు శిక్షకుడిగా నియమించడం పట్ల ప్రిన్సిపాల్ పి. చంద్రశేఖర్ హర్షం ప్రకటించారు. పోలిరెడ్డికి అయనతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

### ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణానికి శ్రీకారం

**సింధియా:** హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. బిల్డింగ్ డాక్ వద్ద భారత నేవీ కంట్రోలర్ ప్రొడక్షన్ వైస్ అడ్మిరల్ బి.శివకుమార్ పూజలు చేసి.. కీలు లేయింగ్ పనులు ప్రారంభించారు. ఈ షిప్ 44,000 టన్నుల బరువుతో నిర్మిస్తారు. ఇందులో 80 శాతం స్వదేశీ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

సముద్ర ఫ్లీట్ విధుల్లో ఇంధనం, మంచి నీరు, ఆయుధ సంపత్తిని అందించడంలో ఈ షిప్ కీలకపాత్ర పోషించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఎనిమిదేళ్ల కాలంలో 169 లక్షల పని దినాలను కార్మికులకు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు సంస్థ సీఎండీ కమాండర్ హేమంత్ ఖత్రి తెలిపారు. 550కి పైగా ఎంఎస్‌ఎంఈలకు అవకాశాలు లభిస్తాయన్నారు. డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కొండచిలువ దాడిలో మేక మృతి

- పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టిన స్నేక్ క్యాచర్


కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ కృష్ణ. చిత్రంలో కొండచిలువ దాడిలో మృతి చెందిన మేక

**దేవరాపల్లి:** మండలంలోని తామరబ్బ పంచాయతీ శివారు కొండకొడాబులో మేకల మందలోకి గురువారం రాత్రి కొండ చిలువ ప్రవేశించింది. ఒక మేకను అమాంతంగా మింగేందుకు ప్రయత్నించింది. దీంతో మేక గట్టిగా అరవడంతో మేకల కాపరి వచ్చి చూడగా మేకను మింగబోతున్న భారీ కొండ చిలువును చూసి తీవ్ర భయాందోళనలతో పరుగులు తీశాడు. కొద్ది సేపటి తర్వాత సమీపంలో ఉన్న రైతులు కొందరు అక్కడికి చేరుకుని కొండ చిలువ నుండి మేకను రక్షించే ప్రయత్నం చేశారు. జనం హడావిడి గమనించిన కొండ చిలువ మేకను అక్కడే వదిలేసి పక్కనే ఉన్న రంధ్రంలోకి జారుకుంది. కాగా అప్పటికే మేక మృతి చెందింది. సమీపంలో ఉన్న కొండ చిలువతో ప్రమాదం పొంచి ఉండటంతో ఈ విషయాన్ని దుంగాడకు చెందిన స్నేక్ క్యాచర్ వరపల కృష్ణకు సమాచారం అందించారు. వెంటనే అతడు రంధ్రంలో ఉన్న కొండ చిలువను అతి కష్టం మీద బయటికి తీసి దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మృతి చెందిన మేక విలువ సుమారు రూ. 10 వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టుబడిన కొండ చిలువ సుమారు 15 అడుగుల పొడవు ఉంది.

# సోషల్ మీడియా కార్యకర్తల అక్రమ అరెస్టులు ఆపాలి


విలేకరులతో మాట్లాడుతున్న కంబాల జోగులు

**ఎస్.రాయవరం:** కూటమి ప్రభుత్వం ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని పాయకరావుపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆగడాలు రోజురోజుకి మితిమీరిపోతున్నాయన్నారు. ఇప్పటి వరకు వందల సంఖ్యలో సోషల్ మీడియా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అరెస్టు చేయించడమే కాకుండా కూటమి నేతలు దాడులకు పాల్పడి హింసను పెంచుతున్నారన్నారు. ప్రజలను వంచించే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి అమలు చేయలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇకనైనా దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులకు చెక్ పెట్టకపోతే పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, పార్టీ జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, నాయకులు యల్లపు నాగు తదితరులు పాల్గొన్నారు.

# వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

- రంగురాళ్ల క్వారీల వద్ద పహారా
- జిల్లాలో 15 ప్రాంతాల్లో నర్సరీలు
- డీఎఫ్‌వో ఎం.శామ్యూల్ వెల్లడి


జిల్లా అటవీ అధికారి శామ్యూల్

**నర్సీపట్నం :** వాల్టా చట్టాన్ని అతిక్రమించి చెట్లు నరికితే అటవీ చట్టాలను అనుసరించి చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి ఎం.శామ్యూల్ పేర్కొన్నారు. ప్రధానంగా నేరేడు, మామిడి ఇతర జాతుల చెట్లను నరకడం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. మొక్క చెట్టుగా ఎదగాలంటే ముప్పై ఏళ్లు పడుతుందని, చెట్లు పెంచడం భావితరాల అవసరాలకు చాలా అవసరమని అన్నారు. ఇటీవల నర్సీపట్నం ప్రాంతంలో వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి మామిడి, నేరేడు ఇతర జాతుల చెట్లను నరికి రవాణా చేస్తున్న వారిపై కేసులు పెట్టామన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లు పెంచి, అడవులను సంరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి ప్రజల్లో అవగాహన పెంచడానికి తగిన కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు.

**అంకుడు చెట్ల పెంపకంపై దృష్టి**

లక్క బొమ్మల తయారీకి ప్రధాన ముడిసరుకుగా వినియోగించే అంకుడు చెట్ల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎఫ్‌వో తెలిపారు. దీనికి సంబంధించి విత్తనాలను సేకరించి అటవీశాఖ నర్సరీల్లో మొక్కలు ఉత్పత్తి చేస్తామన్నారు. ఏటికొప్పాక, కైలాస ప్రాంతాల్లో వందల కుటుంబాలు లక్కబొమ్మల తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి జీవనోపాధికి అంకుడు కర్ర చాలా అవసరమన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో ఐదు రేంజ్‌ల పరిధిలో 15 ప్రాంతాల్లో నర్సరీలు పెంచుతామని తెలిపారు. సరుగుడు, టేక్, అంకుడు, ఫలసాయాన్ని ఇచ్చే మొక్కలను ఈ నర్సరీల్లో పెంచుతామని, నాణ్యమైన మేలు జాతి మొక్కలు ఉత్పత్తి చేసి రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

నర్సీపట్నం రేంజ్ పరిధిలోని ధన్వంతరీ వనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు. అటవీ శాఖ సరఫరా చేస్తున్న మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రంగురాళ్ల క్వారీల్లో తవ్వకాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. కరక, సాలికమల్లవరం, ఆరిలోవ అటవీ ప్రాంతాల్లోని క్వారీల వద్ద బేస్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు.




# విద్యుత్ షాక్‌తో షిఫ్ట్ ఆపరేటర్ మృతి


మృతుడు పడాల నరేంద్ర (ఫైల్)

**మాడుగుల రూరల్:** విద్యుత్ షాక్‌కు గురై ఎం.కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ పడాల నరేంద్ర (30) బుధవారం రాత్రి మృతి చెందారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్‌ఐ జి.నారాయణరావు గురువారం సాయంత్రం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు నరేంద్ర బుధవారం రాత్రి సొంత పని మీద వీరనారాయణం వెళ్లి వస్తున్న సమయంలో గాదిరాయి రహదారిలో పద్రె వారి కళ్లాల సమీపంలో రోడ్డు పక్కన తెగిపోయిన విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి బంధువులు గురువారం ఉదయం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అనకాపల్లి పోస్టుమార్టం కోసం తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. నరేంద్ర తండ్రి సోమునాయుడు సుమారు 5 మాసాల క్రితం మృతి చెందారు. మృతుడు అవివాహితుడు కాగా ఆయనకు తల్లి ఉన్నారు.

# పోస్టల్ ఉద్యోగి మృతదేహం లభ్యం

- రైవాడ జలాశయంలో గుర్తింపు
- మృతుడు తూర్పుగోదావరి జిల్లా అన్నవరం వాసి
- చింతలపూడిలో సబ్ పోస్టుమాస్టర్‌గా విధులు


రైవాడ జలాశయంలో తేలిన పోస్టల్ ఉద్యోగి సత్య ప్రవీణ్ మృతదేహం

**దేవరాపల్లి:** దేవరాపల్లిలో రెండు రోజుల క్రితం అదృశ్యమైన చింతలపూడి పోస్టల్ ఉద్యోగి దాసరి సత్య ప్రవీణ్ (23) రైవాడ జలాశయంలో గురువారం ఉదయం శవమై కనిపించాడు. జలాశయం గట్టుపై గురువారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు నీటిలో తేలిన మృతదేహాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సత్య ప్రవీణ్ కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు అప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఉండటంతో అనుమానంతో వెంటనే అతడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. సత్య ప్రవీణ్ మృతదేహమేనని అతడి కుటుంబ సభ్యులు స్టేషన్ రైటర్ ఎస్. పైడిరాజు ఎదుట నిర్ధారించడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పుట్టెడు దుఃఖంలో కుటుంబ సభ్యులు..**

చేతికి అందివచ్చిన కొడుకు అర్థంతరంగా తనువు చాలించడంతో బాధిత కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. తూర్పుగోదావరి జిల్లా అన్నవరానికి చెందిన లోవరాజు, సుధారాణిల రెండవ కుమారుడు దాసరి సత్య ప్రవీణ్. మూడేళ్ల క్రితం దేవరాపల్లి మండలం చింతలపూడి సబ్ పోస్టుమాస్టర్‌గా ఉద్యోగం రావడంతో దేవరాపల్లిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగా మంగళవారం కూడా ఉద్యోగానికి వెళ్లిన సత్య ప్రవీణ్ ఇంటికి తిరిగి వచ్చారు. మధ్యాహ్నం వాతావరణం చల్లబడటంతో రైవాడ జలాశయ సందర్శనకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలు జారి జలాశయంలో పడి మృతి చెందాడని తండ్రి లోవరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ తెలిపారు.

# మైథలాజికల్ థ్రిల్లర్ 'దేవకీ నందన వాసుదేవ'

**దాబాగార్డెన్స్:** అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ' అని ఆ సినిమా హీరో గల్లా అశోక్ అన్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా గురువారం చిత్ర బృందం విశాఖలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో మాట్లాడారు. దర్శకుడు అర్జున్ జంధ్యాల కమర్షియల్ సినిమాకు వినోదం మేళవించి అద్భుతంగా తెరకెక్కించారన్నారు. ఈ సినిమాకు హనుమాన్ దర్శకుడు ప్రశాంత వర్మ కథ అందించారని, ఈ చిత్రం ట్రైలర్, టీజర్లకు మంచి స్పందన వచ్చిందన్నారు. సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో యాక్షన్ సినిమా చేయాలని ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మంచి చేయాలనుకునే వారికి దేవుడు ఎప్పుడూ వెంటే ఉంటారని, సాయం చేసే వారే దేవుడనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు తెలిపారు. బోయపాటి శ్రీనివాస్ వద్ద తాను దర్శక విభాగంలో పనిచేసినట్టు దర్శకుడు అర్జున్ జంధ్యాల చెప్పారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల్లో టాప్-10లో నిలిచానని గుర్తు చేశారు. సమావేశంలో నిర్మాత సోమినేని బాలకృష్ణ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విద్యార్థులకు జ్యూట్ బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు జ్యూట్ బ్యాగులు అందిస్తున్న జీఎం ఎస్వీ ప్రసాదరావు

**తుమ్మపాల:** పర్యావరణ సంరక్షణ చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని సాగర్ ఫ్యాక్టరీ జీఎం ఎస్వీ ప్రసాదరావు కోరారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా కశింకోట మండలంలో బయ్యవరం జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి జ్యూట్ బ్యాగుల పంపిణీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ హెడ్ పాండురంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రేషన్ షాపుల్లో కందిపప్పు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ భద్రం

**అనకాపల్లి:** రేషన్ దుకాణంలో కందిపప్పును వినియోగదారులకు అందజేయాలని సీపీఎం జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10, 17 డిపోల పరిధిలో ఎండీయూ ఆపరేటర్లు, డిపో డీలర్లు ఒక్కటై కార్డుదారులకు కందిపప్పు ఇచ్చినట్లుగా వేలిముద్రలు తీసుకుని ఎగవేస్తున్నారని ఆరోపించారు. అటువంటి డిపోలపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేయించి, చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఆర్.శంకరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

### బెల్ట్ దుకాణంపై దాడి

**పెందుర్తి:** పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవరజగ్గయ్యపాలెంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై పోలీసులు గురువారం దాడి చేశారు. నిర్వాహకుడు కనుగుల చండికేశ్వరరావును అదుపులోనికి తీసుకుని అమ్మకానికి సిద్ధంగా ఉన్న 140 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఏపీ ఎక్సైజ్ యాక్ట్ ద్వారా కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వి. సతీష్‌కుమార్ వెల్లడించారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 2,114బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,600 | 4,390 |
| మొదటి రకం | 3,640 | 4,310 |
| రెండో రకం | 3,310 | 3,770 |
| మూడోరకం | 3,100 | 3,300 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| దేవర | : రాజా |
| 'క' | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| అమరాన్ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| కంగువ | పర్లిసాయి |
| మట్కా | : షిర్డిసాయి |
| కంగువ | :వెంకటేశ్వర |
| విశ్వం | : శ్రీసత్య |
| లక్కీ భాస్కర్ | : రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 323 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చును.



# బాలల నేస్తం.. చాచా నెహ్రూ

- వాడవాడలా బాలల దినోత్సవం
- జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



సత్యనారాయణపురం పాఠశాల హెచ్ఎంకు మైక్‌సెట్ అందజేస్తున్న క్లబ్ అధ్యక్షురాలు ఫణి



గాంధీనగరం బీసీ వసతిగృహంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, తదితరులు



ఉడ్‌పేట కిడ్స్ పాఠశాలలలో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

**అనకాపల్లి:** బాలల నేస్తం, దేశ తొలి ప్రధాని, సంస్కరణవాది పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బాలల దినోత్సవాన్ని అనకాపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పట్టణం, మండలంలోని పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరం, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను పలువురు ఉపాధ్యాయులు, వక్తలు, అతిథులు గుర్తు చేసుకున్నారు. స్థానిక గాంధీనగరం బీసీ వసతి గృహంలో, జీవీఎంసీ పెద్ద హైస్కూల్ అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు రమణ, కాండ్రేగుల సుబ్రహ్మణ్యం, సాంబశివరావు, బీసీ వసతిగృహం వార్డెన్ కె.నాగులపల్లి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ ప్లే స్కూల్లో చిట్టిపొట్టి చిన్నారులతా నెహ్రూ వేషాధారణలో ఆకట్టుకున్నారు.

- మండలంలో సత్యనారాయణపురం ప్రాథమికక పాఠశాలలో పట్టణ వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పల్లా బాబూజీకి మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఫణి, కార్యదర్శి సువర్ణ, కోశాధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక నెహ్రూచౌక్‌లో నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలపురెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ నవ భారత రూప శిల్పి నెహ్రూ అని, పంచవర్ష ప్రణాళికలు రూపొందించి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.
- స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలతో పాటు పలు క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు హెచ్ఎం రుధిరరాణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేల్పులవీధి జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం రుధిర రాణి



నెహ్రూచౌక్‌లో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



అనకాపల్లి శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపకారాగార పర్యవేక్షణాధికారి అనిల్‌కుమార్

**అనకాపల్లి:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అనకాపల్లి ఉప కారాగార పర్యవేక్షణాధికారి డి.అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలను పురస్కరించుకుని మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ సమయంలో పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల వారోత్సవాల ప్రోగ్రాం కన్వీనర్ బల్లా నాగభూషణం, గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**తుమ్మపాల:** మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. కశింకోట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి శిష్టి అప్పారావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. తేగాడ కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో ప్రభావతి, డీసీడీపీవో రమేష్ బాలల హక్కులపై అవగాహన కల్పించారు. తాళ్లపాలెంలోని శ్రీగాయత్రి హైస్కూల్‌లో జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థులు నెహ్రూ వేషధారణలో ఆకట్టుకున్నారు.



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో పురస్కారాలు అందుకున్న క్రీడాకారులు



కశింకోట గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న అధికారులు



కేజీబీవీ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

- కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో 68వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పతకాలు సాధించిన విజేతలకు పూర్వ విద్యార్థులు దివంగత వాడపల్లి జోగారావు, వాడపల్లి రాంప్రసాద్ జ్ఞాపకార్థం హెచ్ఎం అప్పారావు జ్ఞాపికలు అందజేశారు. జిల్లా స్థాయిలో 18 పతకాలు, రాష్ట్ర స్థాయిలో 6 పతకాలు విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానమే లక్ష్యం

**అనకాపల్లి:** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని విద్యాశాఖ విశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆర్.విజయభాస్కర్ అన్నారు. కశింకోట మండలం తేగాగ కేజీబీవీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. రానున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వచ్చే ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానమే లక్ష్యంగా బోధన సాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి.అప్పారావు నాయుడు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ ఆర్.విజయభాస్కర్

## ఇంటింటికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభం

**తుమ్మపాల:** ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంటింటికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తాళ్ళపాలెం వైద్యాధికారి డాక్టర్ యు.రమేష్ తెలిపారు. మండలంలో నూతన గుంటపాలెంలో గురువారం ఎన్‌సీడీ-3.0 క్యాన్సర్ సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు చేసి నోటి, సర్వైకల్, బ్రెస్ట్ వంటి కాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పిస్తామన్నారు. అవసరమైన వారికి సత్వర ఉచిత చికిత్స అందించడానికి ఈ సర్వే చేపడుతున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు, ఆశ కార్యకర్తలు ద్వారా జరుగుతున్న సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వి.ఈశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి ఇంటింటికీ వెళ్లి తిరిగి ప్రజలకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణధికారి వి.ఎ.సుబ్బారావు, ఎంఎస్‌వీ ప్రసాద్, కేఎస్ఆర్‌కే నరసింహారావు, ఎంపీహెచ్ఏ ఎం.తత్రా పెంటారావు, ఏఎన్ఎం.సుగుణమాల, ఆశా కార్యకర్త భవానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇంటింటికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

## గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం

**అనకాపల్లి:** గ్రామాల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండల పరిషత్ ఆవరణలో జీపీడీపీ, బీపీడీపీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో కె.వి.నరసింహరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో జరిగిన గ్రామ సభల్లో గుర్తించిన పనులకు ఆధారంగా ఎంతెంత నిధులు అవసరం ఉందో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో నివేదికలు వేయించుకోవాలన్నారు. పట్టణాలకు గ్రామాలు పట్టుకొమ్మలాంటివని, గ్రామాలు అభివృద్ధి చేసినప్పుడే వలసలు తగ్గుతాయన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత కల్పించడంతో ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ, వైస్ ఎంపీపీ అయితా రాము, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

## పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

**అనకాపల్లి:** పెంచిన ట్రూ అప్ విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. ఇంటింటా సీపీఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్సీ వాయిదా వేయడం అన్యాయమని, గ్రూప్-1, 2 అగమ్యగోచరంగానే ఉన్నాయని, కోచింగ్‌లు తీసుకున్న యువత అయోమయంలో పడిపోయారని చెప్పారు. వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రారంభించి, ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## విద్యుత్ వైర్లకు తగిలి గడ్డి వ్యాన్ దగ్ధం

**సబ్బవరం:** మండలంలోని ఆరిపాక సమీపంలో వరి గడ్డి తరలిస్తున్న టాటా ఏస్ వ్యాన్ గురువారం అగ్నిప్రమాదానికి గురై దగ్ధమయింది. స్థానికులు భయాందోళనతో పరుగు తీశారు. చోడవరం నుంచి సబ్బవరం వైపు గడ్డిని తరలిస్తున్న ఈ వ్యాన్‌కు మంటలు అంటుకోవడంతో భయపడిన డ్రైవర్ వాహనాన్ని చినయాతపాలెం పెట్రోల్ బంకులోకి మళ్లించారు. బంక్ సిబ్బంది తోపాటు, వినియోగదారులు కేకలు వేయడంతో రోడ్డుపక్కనే ఉన్న ఓ ఇంటి వద్దకు మళ్లించాడు. విద్యుత్ తీగల కింద నిలిపేశారని కేకలు వేయడంతో మళ్లీ రోడ్డువేపు తిప్పాడు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. చుట్టుపక్కల ఉన్నవారు మంటల్ని ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇంతలో అటుగా వచ్చిన పొక్లెయిన్ డ్రైవర్ చాకచక్యంగా కాలుతున్న వ్యాన్‌ను రోడ్డు పక్కకు తిరగేసి, గడ్డిని తొలిగించి మంటల నుంచి వ్యాన్‌ను బయటకు తీశాడు. ఇంతలో ఫైర్ ఇంజన్ వచ్చి, మంటల్ని అదుపు చేసింది. విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు చెప్పారు.



వ్యాన్‌లోని గడ్డిని తొలగిస్తున్న పొక్లెయిన్

# కోతుల దండుతో భయం.. భయం

- కశింకోటలో యథేచ్ఛగా సంచారం
- నివారణ చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి



కశింకోటలో ఇళ్లపై నుంచి సంచరిస్తున్న కోతుల మూక

**కశింకోట:** కశింకోటలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గవరపేటలోని పెద్ద గుమ్మం, కనక మహాలక్ష్మి వీధి, కస్పావీధి తదితర ప్రాంతాలోని జనావాసాల మధ్య, శారదానది అవతల పొలాల్లో 50 పైగా పిల్లలతో పాటు కోతుల మూక వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇళ్లపైన, చెట్లపైన సంచరిస్తూ ఏ మాత్రం ఆదమరచినా ఇళ్లలోకి ప్రవేశించి కూరగాయలు, సరకులు ఎత్తుకుపోతున్నాయి. తరమడానికి ప్రయత్నిస్తే ఎదురు తిరిగి గాయపరుస్తున్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేబుల్ వైర్లు, డిష్ యాంటినాలను ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. శారదా నది అవతల ఉన్న పంట పొలాలకు, పశువుల శాలలకు వెళ్లే రైతులపై దాడి చేస్తున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. చెరకు, జామ, బొప్పాయి తదితర పంటల ఫల సాయానికి నష్టం కలిగిస్తున్నాయని వాపోతున్నారు. పొలాలకు భోజనాలు తీసుకు వెళ్లే మహిళలపై దాడిచేసి భోజనాన్ని నేల పాలు చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదులు చేస్తున్నా ప్రయోజనం లేకపోతోంది. సాధారణ కోతులు అలవ కోతి అంటే భయపడతాయి. కన్నూరుపాలెంలో గతంలో కోతుల బెడద నివారణకు పంచాయతీ అధికారులు అలవ కోతిని రప్పించి గ్రామంలో కొంత కాలం తిప్పడంతో కోతుల సంచారం తగ్గింది. అదే తరహాలో చేయడం గానీ, కోతులను పట్టి అటవీ ప్రాంతాలకు తరలించడం గానీ అధికారులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### కోతుల నివారణకు చర్యలు అవసరం



శారదానది అవతల కోతుల మూక సంచారం ఎక్కువగా ఉంది. ఇవి పొలాలకు భోజనాలు తీసుకెళ్లే మహిళలను, రైతులను దారి కాచి గాయపరుస్తున్నాయి. భోజనాలు నేల పాలు చేస్తున్నాయి. వాటిని తరమడానికి ప్రయత్నిస్తే ఎదురు దాడికి దిగుతున్నాయి. పొలాలకు రాకపోకలు సాగించడానికి భయమేస్తోంది. జామ, బొప్పాయి, ఇతర పండ్లను తినేస్తున్నాయి. కోతుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పెంటకోట వెంకటరావు, రైతు, కశింకోట

### ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి..



కోతులు ఇళ్లలోకి ప్రవేశించి తిను పదార్థాలు, కూరగాయలు, సరకులను ఎత్తుకు పోతున్నాయి. వీధులు, ఇళ్లపై విచ్చల విడిగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలను కరిచి గాయపరుస్తున్నాయి. భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. కేబుల్ వైర్లను ధ్వంసం చేస్తున్నాయి. మేడలపై ఉన్న డిష్ యాంటీనాలను సైతం పాడు చేస్తున్నాయి. వీటిని నివారించడానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

–భీశెట్టి రమణబాబు

### త్వరలో నివారణ చర్యలు

కోతుల నివారణకు త్వరలో చర్యలు తీసుకుంటాం. ఈ సమస్యపై ఇప్పటికే పంచాయతీ సమావేశంలో చర్చించాం. నిధుల కొరత ఉంది. అయినా ఏ విధంగా నివారించాలనే విషయమై సుదీర్ఘంగా చర్చించి చర్యలు చేపడతాం.

– రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి, కశింకోట

## ఆర్టీసీ బస్‌లో తరలిస్తున్న గంజాయి పట్టివేత

**పెందుర్తి:** అరకు నుంచి విశాఖ నగరానికి ఆర్టీసీ బస్‌లో తరలిస్తున్న గంజాయిని పెందుర్తి చెక్ పోస్టు వద్ద పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ బ్యాగ్‌లో ఉన్న రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోనికి తీసుకున్నారు. వివరాలివి..అరకువ్యాలీలో నివాసం ఉంటున్న కేడా సంధ్య తన బ్యాగ్‌లో గంజాయిని నగరానికి తరలిస్తుంది. పెందుర్తి వద్దకు బస్ వచ్చేసరికి సాధారణ తనిఖీలు చేస్తుండగా గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న సంధ్యను అదుపులో తీసుకున్నారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రెడ్డి అసిరితాత దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీసీ బస్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

## ఘనంగా మరిడిమాంబ పండగ

**తుమ్మపాల:** మండలంలో రేబాక, మార్టూరు గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని గ్రామ దేవతను దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. పసుపు కుంకుమలతో పాటు వస్త్రాలు, పిండి వంటలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. అగ్నిగుండాలు తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నుంచి అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో డప్పులు, వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పూజలందుకున్న మరిడిమాంబ అమ్మవారు